# ఉష

నిజంగా, అంది చిత్రరేఖ సమాధానంగా. నా చెవులను నేను నమ్మలేకపోతున్నాను. ఒకవేళ కొంటెతనానికి అన్నదేమో. తలెత్తి చూచాను. చిత్రరేఖ నొసల విభూతిరేఖ వెన్నెలలో కర్పూరరేఖ లాగా మెరుస్తోంది. ఆమె కన్నులు- పసిపాప కన్నులవలె నిసర్గ మధురాలు. ఆమె ముఖం- సరస్సులో సగం వికసిస్తూన్న పద్మం. నాలో నేను కిందా మీదా అవుతున్నాను. నిజంగానే నాతోపాటు చిత్రరేఖ వస్తుందా? పరవశం ఎక్కువయి, మనస్సు పసిపాపవలె అయింది. కొసుదురూ, మళ్ళీ అడిగాను.

చిత్రా, చిత్రా, రేపు నేను అత్తవారింటికి వెళితే- నువ్వు నిజంగా నాతోపాటు వస్తావా? అనీ.

చిత్రరేఖ నవ్వలేదు. "వస్తా నిజంగానే వస్తా...." అంది.

నాలో ఉడికి, ఉడికి, పెల్లుబికే ఉత్సాహాన్ని అదుపులోకి తెచ్చుకుంటు న్నాను. ఎందుకో తెలీదు. సాయంత్రంనుంచీ— అత్తవారింటికి వెళుతున్న ట్లయింది. చీరా సారే సర్దుకొని పరివారం వస్తూంటే పల్లకీలో కూర్చుని, ఉయ్యాలలాగా ఊగే మనసుతో, మగనితో అత్తవారింటికి వెళుతూన్నట్లు....

నాకే తెలుసు, నిష్కారణంగా వొచ్చిన ఆలోచన అని. అయినా నన్ను నేను అదుపులోకి తెచ్చుకోలేకపోతున్నాను.

పెర్రిదానా....

ఇంకెవరు, చిత్రరేఖే. మహారాజ పుత్రినని — అందరూ, నా దగ్గర భయం భయంగా వుంటారు. చిత్రకే— చెల్లు, అట్లాగే స్వేచ్ఛగా వుండడం. ఆమె యోగిని."ఎందుకీ వెర్రి ఆలోచనలు?...."అంది మళ్ళీ. మనస్సు నొప్పి పడుతోంది. చిత్రరేఖ వూరికే మాట్లాడదు. మాట్లాడింవో అది జరిగి తీరు తుంది. చిత్ర యోగశక్తి అలాంటిది!

ఏమయిందో ఏమో....

"పెళ్ళికాలేదు, భర్త రాలేదు. ముద్దూ ముచ్చటల మాటలు ఆలో చిస్తావేం?...." అంది. మళ్ళీ, "జరుగుతై, అన్నీ జరుగుతై, ఉషా.... నీ అత్తారింటికి నేనూ వస్తాను. ఏం...." అంది.

నిశ్చలంగా నవ్వింది.

గొప్పవారు నవ్వినా గొంతుకమీద కత్తే, ఏం అవుతుందో అని.

ఏం, అట్లా అన్నావు?.... అన్నాను. నామాట నాకే వెలితిగా ఉంది. చిత్రరేఖ నెమ్మదిగా లేచింది. యోగసాధనకు సమయం అవుతూంది కాబోలు అనుకున్నాను. చిత్రరేఖ నెమ్మదిగా, వెలుగుతార నడిచి వెళ్ళినట్లు వెళ్ళింది. ఈ ప్రశాంతమైన వేళ, యోగిని చిత్రరేఖ- యోగీశ్వరేశ్వరుడు

శివుడి సన్నిధిని సాధనచేస్తుంది. ఇంతకూ ఆమె మాత్రం ఏమన్నదీ.... మంచి మాటలే అన్నది; నా ఉలుకేగాని, ఆమెలో ఏమీలేదు.... ఎందుకో భయంభయంగా గుబులు గుబులుగా వుంటుందేం....

ఏమన్నా ప్రమాదం రాబోతోందా....? ఛ. ఆ మాటే తలపెట్ట గూడదు.

నరమానవులకు ప్రవేశం లేని ఈ శోణపురం.... సర్వశక్తి స్వరూపుడు, యోగీశ్వరేశ్వరుడు, శివుడు తానుగా ఉండి సంరక్షిస్తూన్నారు. వేల పేరుల బలంలో, బలగంతో నాన్న పరిపాలిస్తున్నారు. మనకేమిటి, ప్రమాదమేమిటి? నిర్భయం, నిశ్చింత.

ఓ.... భయంలేదు అనుకోగానే ఎంత బరువు తీరినట్లవుతుంది. శివా, సర్వజ్ఞ మూర్తీ.... నీ దయ.... నీ కృప.

వెన్నెల, గుడ్డి వెన్నెల, వెలుగు, సన్నని వెలుగు, మెత్తని సూర్యకాంతి, మబ్బులు, చల్లగాలి, తేటనీరు, సరస్సులు, సరస్సులలో ప్రతిఫలించే సంపూర్ణ చంద్రుడు, సర్వశక్తి సమన్వితుడైన తండ్రి, ఈ శోణపురం— ఈ నా జీవితానికి ఎన్ని ప్రసాదించావు తండ్రీ.... నీ దయ. మబ్బులు— చల్లగాలి— జాజి పూలు....

ఏమిటా అడుగుల చప్పుడు. గుసగుసలాంటి సవ్వడి. మల్లెపొదలో, విప్పారిన పుష్పమూ పచ్చని వర్ణములా గుసగుసలాడినట్లు— సన్నగా వీణమీటినట్లు — ఎవరో.... ఎవరో వస్తున్నట్లుంది.

ఎట్లా వస్తారు? శోణపురంలోకి నరమానవుడు రావడమే.... వస్తున్నాడే! కిరీటధారి, కుండలాలంకృతుడు. ఆః! చెంపకు చారెడేసి కళ్ళు. సాలప్రాంశువు, నెమ్మదిగా, పరిశీలనగా, రాగభావంలాగా వస్తున్నాడు.

వినీలదేహుడు, పీతాంబరుడు, ఎవరీతను! మనవాళ్ళు చెప్పుకొనే మన్మధునా? మన్మథుడు కాదు. శివుడంటే— మన్మథుడికి భయం. ఇక్కడికి రాడు.

వచ్చేశారు....

రాజపుత్రీ....

—వీణ మీటినట్లుంది. వీణ ఎక్కడుంది ఇక్కడ? నా హృదయమే వీణ పలుకుతోంది.

రా, ఉషా రాకుమారీ....

ఏం గాంభీర్యం ఆ కంఠంలో! దుర్గమమైన ప్రదేశంలోకి వచ్చినా. దుందుడుకుతనమైనా, సహజ గాంభీర్యం ఎక్కడికి పోతుందీ ?

—తలయెత్తి చూచాను. నిదానంగా చూచాను. మహా పురుషుడు! సందేహంలేదు.

ఎవరు మీరు ?....

—ఇదేం పిచ్చిప్రశ్న. ఎవరైతేనేం. కన్యకాంతఃపురంలోకి, రాగూడనివారు, రారాని వేళ, ఎందుకు వచ్చారని అడగదోయి, వెర్రిదాన్ని— ఎవరుమీరు? అని అడిగానేమిటి? అందుకే చిత్రరేఖ, వెర్రిదానా అంది.

నల్లకలువలలాంటి కళ్ళలో కల్లా? కలా? అన్నట్లు చూస్తావేం ? అమృతమయమైన ఆ నీ ముఖబింబానికి అరుణిమను కల్పిస్తావేం. దానిమ్మ గింజలవంటి నీ పలువరుస, పట్టుదల పలుకుతున్నట్లుందేం—? నా శిరస్సు సిగ్గుతో వంగింది. ఎవరో ఎరగనివారు, విననైనా విననివారు, ఏకాంత గృహంలోకి వచ్చి— నీ వొళ్ళు, నీ కళ్ళు, నీ పళ్ళు అంటూ వర్ణిస్తూంటే. కాలసర్పంలాగు అయిపోయి, కాటువేసి చంపేయాలని వుంటుంది మరి. ఎక్కణ్ణించి వచ్చిందో సిగ్గు. తలవొంచుకున్నాను. ముందుకు వచ్చారు.

ముద్దుగా, బాలా— బేలా.... అన్నారు. గులాబీపూల రెక్కలవంటి నా చేతుల్ని తన చేతులలోకి తీసుకున్నారు. నా గుండెలు కొట్టుకుంటున్నాయి. నీకేం భయంలేదు. నేనున్నాను.... అన్నట్లు, నా రెండు చేతులనూ పరిగ్రహించారు. తన గుండెలకు అదుముకున్నారు. తన నుదుటికి, చంద్రవంక వంటి తన నుదుటికి అద్దుతున్నారు. నా చేతులు. బరువుగా నిట్టూర్చారు. ఆ ఊపిరి నా చెంపలకు వెచ్చగా తగులుతోంది. మనస్సు మణిగింది. బుద్ధి జోకొట్టినట్లు అయింది. హృదయం ఎగిరి గంతేసినట్లు అయింది. ఆ లాలన, ఆ ప్రేమ మాటలు, ముక్తసరి మాటలు, నేను నేను కాను.... ఇంతకూ ఎవరు ఈయన ?

ఎవరైతేనేం. దైవం నాకోసం యీ రూపంలో వచ్చారు. నాకు దైవమే ఈయన. నా జీవితమందార మృదు కుసుమమాలను, వారి కంఠానికి వైజయంతీమాలగా సమర్పించాను.

ఏదీ? ఏకీ? లేదే. ఎక్కడికి వెళ్ళారు? ఎంత వెదికినా లేదు. కల చెరిగిపోయింది. తెలివి వచ్చింది. తెల్లవారుతోంది. తెలతెలవారుతూంటే, ఆకాశాన ఉషా కన్యతోపాటు సూర్యుడూ పైకి వస్తూంటే— వాతాయనం దగ్గర మేముభయులమూ నిలబడి- ఈ ఉషా కన్యతోపాటు మీరు— ఆ సూర్యమూర్తులు, అందాం అనుకున్నాను. ఏరీ ? చీకటిరాసులనైనా చిరగ్గొట్టి ప్రకాశించే, ఆ ముద్దు ముఖబింబం ఏది? ఎక్కడికి పోయింది? ఎక్కణ్ణించి వచ్చింది? ఎవరో, అడివినిపోయే పంచవన్నెల రామచిలుక, వచ్చి అరిచేతిమీద వాలింది. ఎగిరి వెళ్ళిపోయింది. సరస్సులో మెరిసే మత్స్యమూర్తి, వెన్నెల్లో వచ్చి— వెండివలె మెరిసి, బంగారంవలె ధగధగలాడి అపరంజి అందాలు చూపి అల్లా అల్లా మాయం అయ్యారు. ఏరీ? నా జీవిత పూజా పుష్పమాలను తన కంఠసీమను ధరించిన ఆ పుణ్యపురుషులు, ఏరీ ?

— మళ్ళీ చీకటి, మళ్ళీ—వెన్నెల, ఏమో రావచ్చు, రాకపోవచ్చు. కటిక చీకటి రాత్రులే సింహంలాగా గర్జించవచ్చు. ఏమో. ప్చ్ .... ఏమో. ఏమో....

— మామూలుగా వచ్చి పరిచర్యలు చేసే పరిజనం వచ్చారు. వెళ్ళారు. అబ్బ....ఎక్కడికి వెళ్ళితే కనబడతారు? ఎక్కడ వుంటారని వెద కడం. ఎవరో, ఎక్కడివారో తెలిస్తే గద ! ఏమయినా, నిద్రలాగా నీర సిస్తోంది ప్రాణి. కులధనం, సర్వస్వం కోలుపోయి, బిచ్చానికి బయలు దేరి నట్టుందిగా ఉంది ఆత్మ. అబ్బ, గుండెలు పిండుకుని పోతున్నాయి. సూర్యుడు ఉదయిస్తున్నాడు. ఉదయిస్తున్నాడేమిటి ? ఉదయించాడు. ఏమిటీ రాడు? యివాళ సూర్యుడు యిట్లా వున్నాడేం ఎందుకు రొదచేస్తున్నట్లుంది. ఏమిటో- మనస్సు పాడై తే-ప్రతిదీ మహా అసహ్యంగా వుంటుంది.

ఎవరది ? కాంతిధార.

ఎవరది ? ఎవరో .... వస్తున్నారా, నా దైవమూర్తి. కాదు, ఎవరో....

మళ్ళీ అడుగులు....ఎవరో.... చిత్రరేఖ.

ఇప్పుడా చెలికత్తెలు! అందులో చిత్రరేఖ!

— వచ్చి సరసను కూర్చుంది. నిలూనా నన్ను పరికించి చూచింది, మృదువుగా నవ్వింది. చిత్ర నవ్వుతోంది. నా రహస్యం తెలిసిపోయిందా ఏం? ఏమో, యోగశక్తి గొప్పది.

ఆరాటపడకు....అంది.

—ఎందుకన్నట్లు యీ మాట ?ఎన్నివిధాలనో అర్థం అవుతోంది ఆ కాన్తమాటా. ఈ యోగులతో యిదే చిక్కు, చూచి చూచి ముత్యమంతమాట అంటారు.

ఎన్నెన్ని విధాలనో అర్థం అవుతుంది. మనం ఊహించుకొనే అర్థం వేరు. తాము అనే అర్థంవేరు. వారు అనుకున్న అర్థమే అవుతుంది. తల వొంచుతున్నాను.

విచారపడతావేమి, నేనున్నానుగదా నీకు ఉషా.

తలయెత్తి చూచాను. నవ్వాను.

తనూ నవ్వింది. నేను నవ్వకపోయినా బాగుండేదేమో. నవ్వినవ్వు, నిలూనా ప్రాణిని పట్టియిస్తుందంటారు. పోనీ, గుడ్డిలో మెల్లి, నేనున్నానుగదా అని ధైర్యం చెబుతోంది గదా. విచార సముద్రం వేలాతిక్రమణం చేస్తోంది. చిత్రరేఖ చేతులు పుచ్చుకున్నాను. చిత్ర, నా ముఖంలోకి చిత్రంగా చూచి-క్షణం కన్నులు మూసింది. ఏంచేసిందో ఏమో, ఆ యోగిని-గుండెలలోకి కొండంత ధైర్యం ప్రసరించింది.

బెంగపెట్టుకోకు-మళ్ళీ వస్తా....అంది, వెళ్ళింది.

ఎందుకు వచ్చినట్లు? ఎందుకు వెళ్ళినట్లు?

నీ రహస్యం నాకు తెలుసులే, అని చెప్పిపోడానికి వచ్చిందా? నా జీవితం అంతా, తన గుప్పిట్లో పెట్టుకొని ఆడిస్తుందా? ఏమో, ఎంత యోగిని అయినా, మంత్రికూతురు. మహారాజు ప్రాణాలు మంత్రి చేతుల్లో. మా ప్రాణాలు, మంత్రి సంతానం గుప్పిట్లో. తప్పు, తప్పు, అల్లాగ అనుకోగూడదు. నేనున్నానుగదా నీకు ఉషా....అని ధైర్యం చెప్పిన చిత్రరేఖనేనా యిలాంటి మాటలు అనుకోడం. ఛా, పాడుమనస్సు. కాస్త మనస్సు వికలం ఐతే చాలు, రారాని పాడు ఆలోచనలు వస్తయ్. అవే పెదవులమీద రాపాడుతాయి.

మళ్ళీ ఎప్పుడు వస్తుందో చిత్ర?

అయ్యో, మందమతిని, అంతే. నా తెలివి తక్కువకు నేను గిజగిజ లాడాలిసిందే. కాలుకాలిన పిల్లిలాగ తిరుగుతున్నాను నా సౌధం అంతా. ఇంత మహాసౌధం ఉందా, నాకు, తిరిగినచోటే తిరుగుతూ, చూసిన వస్తువునే చూస్తున్నాను. పొద్దుపోదు, చిత్రరేఖ రాదు.

చిత్రరేఖను రమ్మని కబురుచేస్తే.... వచ్చి ఏం లాభం, ఏకాకితనాని భరించలేను. తోడుగానన్నా వుంటుంది. వస్తే, రాకపోతే, మా మంత్రి కుమార్తె ఆ మాత్రం మాట తీసేస్తుందా ? రాకపోతే? మళ్ళీ మళ్ళీ కబురు చేస్తూంటాను. విసుగెత్తి అయినా వస్తుంది. ఏం లాభం, మనస్సు చెదిరిన తర్వాత? ఉన్న ఒక్క ఆశ, రవ్వంత ఆశ, ఆ చిత్రరేఖ. ఇంకా నయం, త్వరగా రమ్మని కబురు చేశానుకాదు. ఆ కాస్త ఆశాకిరణమూ అంతర్ధానం అయ్యేది.

అదుగో చిత్రరేఖ....ఏమిటో తెస్తోంది !

ఏమిటివి చిత్రా?

చిత్రపటాలు ....

ఎందుకు?

చూడు....

వీణ బుజాన వేసుకొని సంగీతం పాడుతూన్న గంధర్వులు, యక్షులు, సిద్ధులు, సాధ్యులు, తారణులు, రాక్షసులు, పన్నగులు. అందరూ యువకులే, అందరూ సర్వైశ్వర్య సంపన్నులే.

ఎందుకివి చిత్రా?

నెమ్మదిగా చూడు. గురూపదేశం జవదాటరాదు.

మళ్ళీ మళ్ళీ ఒక్కొక్కటిగా చూస్తున్నాను.

అరుగో వారే, చూచీ చూడగానే సిగ్గుపడ్డానుట. చెక్కిళ్ళు జేవురించాయిట. ఒకరకం సంతోషం-నాకంఠానికి ఎగదట్టిందిట. నా మాట మారిందిట. నేను నేనుకానుట. చిత్రరేఖ చేయి, నా మెడకింద. నా నవ్వు ముఖం నాకే కనిపిస్తోంది. చిత్రరేఖ ముఖం — మార్పులేదు. పసిపాప ముఖం. సరస్సులో నీళ్ళపై తేలి నిద్రపోతున్న చంద్రబింబం.

ద్వాదశ....అంది, తనలోతాను గొణుక్కున్నట్లు. నా కనుబొమ్మలు లేచాయి.

కన్నులు విప్పారినవి.

శ్రీకృష్ణులవారి మనుమడు — ప్రద్యుమ్నపుత్రుడు. అనిరుద్ధుడు .... అంది.

ఆఁహో....అనుకున్నాను.

వస్తా.... అంది. వెళ్ళింది. ఈ పటాలన్నీ యిక్కడ విడిచి వెళ్ళిందేం? ఎవరన్నా చూస్తే....ఏమనుకుంటారు ? ఎవరు ఏమనుకుంటే నేంలే, నాన్నగారు వచ్చి చూచినా భయంలేదు. ఏ ఒక్కరి చిత్రపటమో అయితే గదా. కావలసినన్ని పటాలు. ఎవరు చూచినా ఏం యిబ్బందిలేదు. సిగపూవు ఏమీ వాడదు.

నిమిషం నిమిషం బరువుగా గడిచిపోతోంది. కాలానికి చీమనడక. త్వరగా త్వరగా నడవదు పొద్దు. చిత్రలేఖ ద్వారకకు వెళ్ళి ఉంటుందా ? ఏమో?

పరిచారికలు వచ్చారు. మామూలుగా సువాసనలు అలదారు. కైశ్యం అలంకరించారు. పానుపు వేశారు. దీపాలు పాముల నాలుకలవలె ఉన్నాయి. పన్నగశయనుడు శ్రీకృష్ణులవారు; వారి మనుమలా, వీరు? అరుగో, వారే - కారు, ఎవరో చెలికత్తె ! ఆ సవ్వడి చిత్రరేక చీర మెర మెరా ? కాదు,

ఏమిటో, అదుగో చిత్రరేఖ.... కాదు, నల్లపిల్లి. పిల్లి శకునం గూడానా? యిప్పుడు. మనస్సు కలవరపడితే, త్వరపడుతూంటే, ప్రతిదానికీ ఉలుకుగా ఉంటుంది. అదుగో చిత్రరేఖ. ఏం చెబుతుందో.... ఏమయిందో. అదుగో వారే. వారిని తీసుకొని వచ్చింది. ఎరుగున్న యింట్లోకి వచ్చినట్లు రానుండా, నీరసంగా, నిద్రమత్తుగా వస్తారేం వారు. ఏదీ చిత్రరేఖ. నిద్రపోతూంటే- తన యోగశక్తితో తెచ్చిందా వారిని. ఏదీ చిత్రరేఖ. లేదు. వారు ఒక్కరే వస్తున్నారు. ఎదురువెళ్ళాను. వెళ్ళాను? వెళ్దామనుకున్నాను. వారే వచ్చారు. దీపాలు మామూలుగా వెలిగాయి. దీపాలు శాంతంగా వెలిగాయి. దీపాలు బద్ధకంగా వెలిగాయి. దీపాలు వెలావెలా పోతున్నాయి. గవాక్షం దగ్గిర, వారూ, నేనూ.... ఆకాశాన ఆ ఉషాకన్య. భూమిమీద యీ ఉషాకన్య.

నిరోధంలేని సూర్యుడు ఆకాశాన.

అ-నిరుద్ధులు యిక్కడ, నా పక్కన.

దీపాలు నిద్రలో జోగి, ఆవులించినయ్. మన యింటికి మనం వెళదాం.... అన్నాను.

ఓసారి, వెళదాం.... అన్నారు.

—మనుగుడుపులు గా కాలం గడుస్తోంటే, మా వూరు అన్న మమకారం సడలిపోతుంది కాబోలు. అత్తవారిల్లు, అత్తమామలు, ఆడబిడ్డలు, ప్రతిదీ కొత్త అయిన వాతావరణం— యిదంతా నాకు ముచ్చట, వారికీ యిలాంటి ముచ్చటేనేమో.

వారికి సంగీతం అంటే చాలు. పంచప్రాణాలూనూ.

వీణ వాయిస్తున్నాను. తాంబూలారుణిమలో, సహజంగా ఎర్రనైన వారి పెదిమలు కెంపుల్లాగా మెరుస్తున్నాయి. ఎదురుగా కూర్చుని మైమరచి వింటున్నారు.

"అమ్మా, అమ్మా, మహారాజు...." అంది దాసి భయంగా. నాన్నా, నాన్నగారిక్కడి కెందుకొస్తారు. పిడుగులాగా మహారాజు వచ్చారు. చండ శాసనుడు, శివప్రసాదబలశాలి. బాణమహారాజు వచ్చారు. నేను, కుమార్తెను ఉన్నాననైనా లేదు. సరాసరి—

'ఎవరు నువ్వు?' అన్నారు— "ఎట్లా రాగలిగావు యీ కన్యాంతః పురానికి?" అన్నారు. ఫెళఫెళా ఉరుం ఉరిమినట్లు అయింది. వారిమీద కత్తి తీశారు. నేను అడ్డం వెళ్ళాను.

క్రూరంగా నావంక చూశారు, మహారాజు. నేను చలించలేదు. నాన్నా అని మాత్రం అన్నాను. నాన్న నా మాట వింటేనా?

కూర్చున్న అల్లుడిగారి శిరస్సున చేయివేసి.... ఇక్కడే పడి ఉండు అన్నారు, భటాల్ని కత్తి విసిరివేసినట్లు. వారు మహారాజు. శోణపురాధి వాధులు, బాణచక్రవర్తి. వారి దారిన వారు వెళ్ళారు.

దీపశిఖలలాంటి పాము నాలికలు, వారి చుట్టూరా. ఇదేం కర్మ. ఈ పాముపిల్లలు కాటువేస్తాయా వారిని? చిత్రరేఖ చెప్పింది, నారద మహాముని అంతవారు కల్పించుకున్నారు, నా కథలో. నారద మహాముని కల్పించు కోవాలేగాని, కయ్యాలకు తక్కువా? మనుమడు కనబడడం లేదని శ్రీకృష్ణుల వారు ఎక్కడ అనుకుని పోతారో అని స్వయంగా వెళ్ళి, ఆ జగడం కూటి సత్తరువు, నారద మహాముని.... "అయ్యా, శ్రీకృష్ణా, అనిరుద్ధు శోణ పురంలో కులుకుతున్నాడయ్యా...." అని చెప్పాడుట. పురి ఎక్కించాడట. శ్రీకృష్ణులు – పన్నెండు అక్షౌహిణీల సేనతో కదిలి వచ్చారుట. నాన్నకూ, వారికీ యుద్ధం జరిగిందట. అబ్బ, ప్రతిదానికీ యుద్ధమేనా? పెళ్ళి చేయాలి సినపోట- ప్రళయంలాంటి యుద్ధం. ఆ మాటా నిజమే. యుద్ధంలేకుండా, ఏ స్వయంవరం జరిగిందిటలే.

మా ఇలవేలుపు శివుడుగూడా యుద్ధంలో పాల్గొన్నారుట. నాన్నకు, నావల, అన్ని చేతులూ పోయి- నాలుగు చేతులు దక్కాయిట. చిత్రరేఖ

చెప్పింది. తెల్లవారేసరికి నా అంతఃపురం అంతా అలంకరించేశారు. నారదులవారు, శివుడు, శ్రీకృష్ణులవారు, బాణమహారాజు, నాన్న అందరూ వచ్చారు. నాన్నను చూచి తల వొంచుకున్నాను. క్రీగంట చూస్తున్నాను. శ్రీకృష్ణులువచ్చి, 'నాయనా లే....'అన్నారు. గరుత్మంతుణ్ణి చూచినట్లు అయి వారిని చుట్టిన నాగపాశం కాస్తా మాయమైంది. శ్రీకృష్ణులూ, నారదులూ నన్ను చూచి నవ్వుకున్నారు. మునిమనుమల్ని ఎత్తబోతున్నారు, ఆ నారాయణమూర్తి.

'అమ్మా....' అన్నారు నాన్న.

నమస్కరించాను.

"అత్తవారింటికి ప్రయాణం కాబోతున్నావు తల్లీ...." అన్నారు, గర్జనగా.

లాలనగా, ప్రేమగా అంటారేమో అనుకున్నాను ఆ మాటయినా. గర్జిస్తూన్నట్లు అన్నారు. అల్లుడి నమస్కారాలు స్వీకరించారు, వెళ్ళారు. అత్తవారింటికి ప్రయాణం అంటే- ఏమిటోగా వుంది. ఈయన ఇక్కడున్నట్లు ఉంటారో, లేదో, అక్కడ. అయినా చిత్రరేఖ వుంటుందిగదా, నాలో. నాకోసం ఎంతకైనా తెగిస్తుంది, చిత్రరేఖ.

"చిత్రా, నాతో మా అత్తారింటికి వస్తావుగదూ?" అని అడిగాను.

'ఆఁ....' అంది.

'నీ యోగం, ధ్యానం, శివసన్నిధిని నీ ధ్యానం.... నిజంగా వస్తావా చిత్రా, నిజంగా....' అని కొసురుకున్నాను, చిత్రరేఖ నిబ్బరంగా....

'వస్తా నిజంగా....' అంది.

చిత్రరేఖ మాట అంటే చాలు– జరిగి తీరుతుంది. వస్తుంది, నిజంగా—

●